ఈనాడు
epaper.eenadu.net

# మార్చిలోగా 'మెట్రో స్వాధీనం' పూర్తవ్వాలి: సీఎస్



ప్రభుత్వ అధికారులు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులకు సూచనలు చేస్తున్న కె.రామకృష్ణారావు

ఈనాడు, హైదరాబాద్: ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్వహిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలును ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ మార్చి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.రామకృష్ణారావు సూచించారు. ఈ విషయమై బేగంపేటలోని మెట్రోరైలు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శుల స్థాయి కమిటీ, ఎల్‌అండ్‌టీ అధికారులతో సీఎస్ సమీక్షించారు. ఇరు పక్షాలు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బదలాయింపు సజావుగా, వేగవంతంగా పూర్తి కావాలని కమిటీకి సూచించారు. ఇదివరకున్న ఒప్పందాలకు ఎలాంటి ఆటంకం లేకుండా, న్యాయపరమైన చిక్కులు రాకుండా చేపట్టాలని స్పష్టం చేశారు. స్వాధీనం అనంతరం మెట్రోను హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎలా నిర్వహిస్తుందనే దానిపై హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారు ఎన్వీఎస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ కేవీబీ రెడ్డి, హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ డీవీఎస్ రాజు, ఐడీబీఐ క్యాపిటల్ అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు జరిగిన సమావేశంలో రూ.13 వేల కోట్ల అప్పును బదలాయించుకుని, రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించడానికి ప్రభుత్వం, ఎల్‌అండ్‌టీ ఒప్పందానికి వచ్చాయి.

Date : 17/12/2025 EditionName : GREATER HYDERABAD PageNo :